ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.05.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు ఆరోపించాయి.
2. ఇంటర్మీడియెట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు, రేపటి నుంచి ప్రారంభమవుతాయి.
3. రామగుండం, మణుగూరు మధ్య సింగరేణి బొగ్గు రవాణా కోసం ప్రత్యేక రైల్వే రవాణా కారిడార్ ఏర్పాటు చేయడానికి, కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది.
4. బుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని, ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.
5. ఈ నెల 27న జరిగే వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం ముమ్మరంగా సాగుతోంది.

**కిషన్ – హరీష్**

కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఆరోపించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దొడ్డు వడ్లకు బోనస్ లేదన్న కాంగ్రెస్ పైఖరిని తప్పుపట్టారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలోని రాఘవపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కిషన్ రెడ్డి పరిశీలించారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు జగిత్యాల జిల్లా పూడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్

ప్రభుత్వం 37 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. (డెస్క్)

## ధాన్యం కొనుగోలు

కామారెడ్డి జిల్లాలో 266 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశారు. 48 వేల మందికి పైగా రైతుల నుంచి 616 కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో 551 కోట్ల రూపాయలు జమ చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. **(పిటిసి, రాజన్న)**

## ఇంటర్మీడియట్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటినుంచి ప్రారంభమవుతాయి. జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయి. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర వరకు పరీక్షలు జరుగుతాయి. కాగా ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4వ తేదీ నుంచి మొదలవుతాయి. వివిధ జిల్లాల్లో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి జిల్లాలో 10 వేల 511 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందుకోసం 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా రాష్ట్రంలో పాలీసెట్ పరీక్ష, రేపు జరుగుతుంది.**(డెస్క్, కామారెడ్డి పీటీసీ )**

## బొగ్గు రవాణా కారిడార్

రాష్ట్రంలో సింగరేణి గనులు విస్తరించిన ప్రాంతాలను కలుపుతూ పెద్దపల్లి జిల్లా రామగుండం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక 'రైల్వే బొగ్గు రవాణా కారిడార్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణలో 207.80 కిలో మీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించిన ప్రాంతాల్లో నూతనంగా బ్రాడ్గేజ్ నిర్మించాలని, అందుకు తక్షణమే జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భూసేకరణ చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చింది. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో ఉన్న 26 భూగర్భ, 20

ఉపరితల గనుల ద్వారా ఏటా 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతోంది. సింగరేణి సంస్థ ఏటా వందల కోట్లను కేవలం బొగ్గు రవాణాకే వెచ్చిస్తోంది. ప్రస్తుతం బల్లార్షా నుంచి ఖమ్మం ప్రాంతానికి హనుమకొండ జిల్లా కాజీపేట మీదుగా 349 కిలో మీటర్ల రైల్వే మార్గం ఉంది. రామగుండం- మణుగూరు లైను నిర్మిస్తే దాదాపు 142 కిలో మీటర్ల దూరం తగ్గడమే కాకుండా బొగ్గు రవాణా వ్యయం తగ్గుతుంది.(DESK)

**మేడిగడ్డ**

జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగా మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు వర్షాకాలం లోపు తీసుకోవాల్సిన రక్షణ చర్యలను నీటిపారుదలశాఖ వేగవంతం చేసింది. ఆయా బ్యారేజీల నిర్మాణ సంస్థలు ఈ దిశగా ఇప్పటికే చర్యలను ప్రారంభించాయి. పియర్స్ దెబ్బతిన్న మేడిగడ్డ ఆనకట్టకు రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. (DESK)

## టిఎస్ఆర్టీసీ

టిఎస్ఆర్టీసీని టిజీఎస్ఆర్టీసీగా లోగో మార్చినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఖండించారు. అధికారికంగా ఇప్పటివరకూ కొత్త లోగోను విడుదల చేయలేదని సజ్జనార్ ట్వీట్ చేశారు. **(ట్విట్టర్)**

## బుద్ధ పౌర్ణమి

బుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. బుద్ధుడు పుట్టిన, జ్ఞానోదయం పొందిన, నిర్వాణం చెందిన వైశాఖ పౌర్ణమిని బుద్ధ పౌర్ణమిగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా బౌద్ధ క్షేత్రాలలో పతాకాన్ని ఎగురవేశారు. బౌద్ధ స్తూపాలకు ప్రార్థనలు జరిపారు. బౌద్ధ మత గురువులకు పువ్వులు, అగరుబత్తులు, దీపాలు మొదలైనవి సమర్పిస్తున్నారు. హైదరాబాద్ లోని మహేంద్ర హిల్స్ లో బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుగతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వేడుకలకు హాజరయ్యారు. హుస్సేన్ సాగర్ లోని బుద్ధ విగ్రహం వద్ద కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు అయ్యాయి. (DESK)

## ఎమ్మెల్సీ ప్రచారం

ఈ నెల 27 న జరిగే వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. జనగామ జిల్లా కేంద్రంలో  బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పట్టభద్రుల సమ్మేళనంలో పాల్గొన్నారు. మేధావులందరూ విజ్ఞతతో ఆలోచించి, బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలిపించాలని  కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని  ఎన్టీఆర్ స్టేడియం, జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ ను కలిసి ప్రచారం చేశారు. జీవో నెంబర్ 317, 46 లను తీసుకొచ్చిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు.(PTCs)

## వరంగల్- ఏర్పాట్లు

వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక రిటర్నింగ్ అధికారి ,వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.  శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు జిల్లా పరిధిలో  59 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించామని, వీరందరికీ మొదటి విడత శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.**(PTC)**

## నకిలీ విత్తనాలు -ఆదిలాబాద్

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు పాల్పడిన వారిని గుర్తించేందుకు వ్యవసాయ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. **(PTC)**

## సంగారెడ్డి -ట్రైడెంట్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని ట్రిడెంట్ చక్కర కర్మాగారం- రైతులు ,కార్మికులు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన వివిధ బకాయిలను చెల్లించడానికి అంగీకరించిందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. **(PTC)**

**సూర్యాపేట- కళ్యాణం**

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లోని శ్రీ స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈరోజు తెల్లవారుజామున రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది.**(PTC)**

**ధర్మపురి**

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ రోజు వైశాఖ పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మి సమేత లక్ష్మీ నరసింహ స్వామి కి జరిపిన ప్రాతః కాల అభిషేకం లో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఈ మధ్యాహ్నం కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. **(PTC)**

**నిర్మల్ - ప్రమాదం**

నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మహబూబ్ ఘాటు వద్ద నిన్న అర్ధరాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ప్రమాదం లో ఒక మహిళ మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఈ బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. **(PTC)**

**జగిత్యాల**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గండి హనుమాన్ దేవాలయం దగ్గర జగిత్యాల - నిజామాబాద్ జాతీయ రహదారి పై ఈ తెల్లవారు ఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. మరొకరు గాయపడ్డారు. **(PTC)**

**జహీరాబాద్**

జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ఎన్నికల అధికారి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్షించారు. **(PTC-SR)**

**వరంగల్ -కౌంటింగ్ ఏర్పాట్లు**

వరంగల్ పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు, ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, ఎనుమాముల మార్కెట్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్దనే లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. **(PTC)**